క్లుప్తంగా

షట్టర్లు బాగు చేయాలి



లొద్దలకాగితాపల్లి సమీపంలో మరమ్మతులకు గురైన షట్టర్

నరుబుజ్జిలి: యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌పై షట్టర్లు పాడైపోవడం వల్ల సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. ఈ చానల్ పరిధిలో సుమారు 16 గ్రామాలకు సంబంధించి 6 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. షట్టర్లు, చెక్‌డ్యామ్‌లు సక్రమంగా లేవన్నారు. దీంతో సాగు నీరు నిల్వ చేయడం, మళ్లించడం చేయలేక అత్యవసర పరిస్థితుల్లో రైతులు చుక్కనీటి కోసం ఇక్కట్లుపడుతున్నారు. అధికారులు స్పందించి షట్టర్లు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

జలుమూరు: శ్రీముఖలింగంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కంటికి సంబంధించి అన్ని రకాల జబ్బులకు పరీక్షలు, అవసరమైన చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీతోపాటు ఇతర గుర్తింపు కార్డులు తీసుకు రావాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షకు విశేష స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సారవకోట: మండల కేంద్రంలోని నవతేజ పాఠశాలలో ఆదివారం మండలంలోని విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించారు. రిమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష పేపర్ ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు విద్యార్థులకు అవగాహన కోసం ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 140 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి త్వరలో జరగనున్న పరీక్షకు మెటీరియల్ అందించనున్నట్లు సొసైటీ సభ్యులు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు



పెద్దసవళాపురం సమీపంలో మట్టి తవ్వకం చేసిన కాలువ గట్టు

నరుబుజ్జిలి: యరగాం– పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్ గట్టును యరగాం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ యజమాని ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసి మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకొంటున్నట్లు రైతులు తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీరు చేయాల్సింది చేసుకోండని రైతులుపై తిరుగుబాటు చేస్తున్నట్లు వాపోయారు. ప్రతీ ఏటా అక్రమ పద్ధతిలో మట్టి వ్యాపారం చేసి లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నట్లు ఆరోపించారు. కాలువ గట్టు తవ్వకం చేయడం వల్ల పూర్తిగా గట్టు కుదించికి పోయిందన్నారు. సాగునీరు ఉద్ధృతంగా ప్రవహించే సమయంలో గండ్లు పడే ప్రమాదముందన్నారు. అధికారులు స్పందించి కాలువ గట్టును తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వంశధార జేఈ స్వాతిని ప్రశ్నించగా తక్షణమే చర్యలు చేపడతామని తెలిపారు.

'భౌ'పెడుతున్నాయ్..



జాతీయ రహదారిపై గుంపుగా ఉన్న కుక్కలు

సారవకోట: నరసన్నపేట నుంచి ఒడిశాలోని మోహన వెళ్లే జాతీయ రహదారి 326–ఎపై అలుదు గ్రామంలో కుక్కలు నిత్యం స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో ప్రమాదాలు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయి. పిల్లలు, పెద్దలపై దాడులు చేస్తున్నాయి. కుక్కలు పట్టుకుని గ్రామానికి దూరంగా విడిచిపెట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శిష్టకరణ సంఘం పటిష్టతకు కృషి

నరసన్నపేట: జిల్లా శిష్టకరణ సంఘం పటిష్టతకు కృషి చేస్తానని సదాశివుని కృష్ణ అన్నారు. జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కృష్ణకు స్థానిక శిష్టకరణ సంఘ భవనంలో ఆదివారం నరసన్నపేట సంఘం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. సంఘం సభ్యులు ఎస్.ప్రభాకరరావు, ఆర్.బుజ్జి, అంప్లాం వసంతకుమార్, ఎంవీజీ మోహనరావు, డబ్బీరు వెంకటరమణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ... ఆధునిక వైద్యం

- గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా..



బొరిగివలస హెల్త్ క్లినిక్

నరసన్నపేట: జ్వరం వచ్చినా, మరే ఇతర అనారోగ్యం చేసినా గత ప్రభుత్వ కాలంలో ప్రజలు ప్రైవేట్ క్లినిక్‌లను, ఆర్‌ఎంపీ వైద్యులను ఆశ్రయించేవారు. మండలానికో పీహెచ్‌సీ ఉండేది, ఒక్క డాక్టర్ ఉండే వారు. అరకొర మందులు లభించేవి. డాక్టర్ ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి. పల్లె ప్రజలు వైద్యానికి అనేక అవస్థలు పడేవారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పల్లె ముంగిటకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఒకవైపు నరసన్నపేటలో ఏరియా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం, మాకివలస, ఉర్లాం పీహెచ్‌సీలను మరింతగా పటిష్టం చేసింది. మరోవైపు ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలు చేస్తోంది. ప్రతీ సచివాలయ ప్రాంతంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తోంది. ఏ చిన్న అనారోగ్యం చేసినా గ్రామం నుంచి ఒకటి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లనవసరం లేదు. ప్రజలు గ్రామంలోనే వైద్య సేవలు పొందుతున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి హెల్త్ సెంటర్ల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

నరసన్నపేట మండలంలో 22 హెల్త్ క్లినిక్‌లు..

నరసన్నపేట మండలంలో ఉర్లాం, మాకివలసల్లో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటికి అనుసంధానంగా 22 హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో 6 చోట్ల పక్కా భవనాలు నిర్మించగా.. మరో 6 చోట్ల భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. మిగిలిన 12 చోట్ల భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఆగస్టు నాటికి మిగిలిన భవనాల పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

అందుబాటులో 105 రకాల మందులు..

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా నిత్యం వైద్య సేవలు అందించేందుకు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లను ప్రభుత్వం నియమించింది. వీరితోపాటు ఆ ప్రాంత ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ అందుబాటులో ఉంటున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ ఆధీనంలో 105 రకాల మందులు ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. వీటిని అవసరమైన రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. సుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతోపాటు 14 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా అత్యాధునిక కిట్లు ఏర్పాటు చేశారు. ఇవ కాకుండా క్లినిక్ పరిధిలో 104 వాహనం ద్వారా డాక్టర్ వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులను, పక్షవాతం, ఇతర రోగాలతో మంచానికే పరిమితమైనవారి ఇళ్లకు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. ఒక్కో హెల్త్ క్లినిక్ పరిధిలో సరాసరిన రోజుకు 13 మంది రోగులకు తనిఖీలు చేస్తున్నారు. ఉదయం 11 వరకు క్లినిక్‌లో ఉంటూ తరువాత ఇళ్లకు వెళ్లి వైద్య సహాయం అందిస్తున్నారు. గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.



కంబకాయలో ఓఆర్‌ఎస్ పేకెట్ల వినియోగంపై అవగాహన కలిగిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి

వైద్య సేవలు అందుతున్నాయి



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిన తరువాత వైద్య సేవలు బాగా అందుతున్నాయి. గతంలో చిన్న రోగం చేసినా మాకివలస, నరసన్నపేట వెళ్లాల్సివచ్చేంది. నానా అవస్థలు పడేవారం. మందులు కూడా సక్రమంగా అందేవి కావు. ఇప్పుడు స్వగ్రామంలోనే వైద్య సేవలు అందుతున్నాయి. మందులు కూడా ఇస్తున్నారు. అవసరమైన రక్త పరీక్షలు చేస్తున్నారు.

– దుర్రు ఆదిలక్ష్మి, గోపాలపెంట, నరసన్నపట మండలం

మందులు ఉచితంగా ఇస్తున్నారు



చిన్న అనారోగ్యం చేసినా గతంలో నానా ఇబ్బంది పడేవారం. ఆందోళన చెందేవారం. ఆర్‌ఎంపీ వైద్యుల కోసం ఎదురు చూసేవాళ్లం. ఇప్పుడు విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా వైద్య సేవలు బాగా అందుతున్నాయి. అవసరమైతే ఇంటికి వచ్చి మరీ తనిఖీలు చేస్తున్నారు. అనుక్షణం ఆశ కార్యకర్త, ఏఎన్‌ఎంలు ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. హెల్త్ ప్రొవైడర్ వచ్చి తనిఖీలు చేస్తున్నారు.

– వమ్మరవల్లి భవాని, కంబకాయ, నరసన్నపేట మండలం

రహదారులకు మహర్దశ

- ఏడు రోడ్లుకు రూ.12.10 కోట్లు విడుదల
- పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశాలు

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి మోక్షం లభించింది. ఐదు మండలాల్లో ప్రాధాన్యతాక్రమంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.12.10 కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ డీఈ ఎంఎల్‌వీ సాగర్, ఏఈలు టి.కిరణ్‌కుమార్, గోపాల్‌రావు, ఎన్ఎల్ నాయుడులకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశాలు ఇచ్చారు.

నియోజకవర్గంలో మంజూరైన రోడ్లు ఇవే..

- ఒడిశా సరిహద్దులోని కిమిడి నుంచి రుగడ గ్రామానికి వెళ్లే రహదారి 8.2 కిలో మీటర్లు ప్రత్యేక మరమ్మతులు కోసం రూ.2 కోట్లు నిధులు విడుదల అయ్యాయి.
- టిక్కలిపట్నం నుంచి గొప్పిలి వరకు (జగ్రిబద్ర-చిన్నహంస) 5కిలోమీటర్ల రోడ్డు, మెళియాపుట్టి మండలం రిడింగి సర్ ప్లేస్ నుంచి మహేంద్రతనయ నది వరకు (గొప్పలి నుంచి ఒడిశా సరిహద్దు వరకు) 4.5 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి పనుల కోసం రూ.2.50 కోట్లు నిధులు విడుదలయ్యాయి.
- మెళియాపుట్టి–పాతపట్నం రోడ్డు మూడు కిలోమీటర్లు, తెంబూరు–పాతపట్నం రోడ్డులో తెంబూరు నుంచి పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం వరకు 7.876 కిలోమీటర్లు రోడ్డు అభివృద్ధి కోసం రూ.4.40 కోట్లు నిధులు విడుదలయ్యాయి.
- నౌతల–శ్రీముఖలింగం రోడ్డులో నౌతల నుంచి శ్రీముఖలింగం రోడ్డు నాలుగు కిలోమీటర్ల అభివృద్ధి కోసం రూ.కోటి నిధులు విడుదల అయ్యాయి.
- అలికాం–బత్తిలి రోడ్డులో బొర్రంపేట నుంచి హిరమండలం వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధి పనులు కోసం రూ.2.20 కోట్లు నిధులు విడుదలయ్యాయి.

అభివృద్ధికి ప్రాధాన్యం



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వటం జరిగింది. నిధులు కావాలని అడిగితే సమస్య తెలుసుకుని నిధులు ఇస్తున్నారు. ఇందులో భాగంగానే ఏడు రోడ్ల అభివృద్ధికి రూ.12.10 కోట్లు నిధులు మంజూరు చేశారు. నాలుగేళ్ల పాలనలో ఇప్పటివరకు రూ.56 కోట్లు ఖర్చుతో కొత్త రోడ్లు వేయటం, మరమ్మతులు చేపట్టడం జరిగింది.

రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

మరికొన్ని రోడ్లుకు ప్రతిపాదనలు

పాతపట్నం నియోజకవర్గంలో మరికొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరుతూ పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆర్అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వరావు ప్రతిపాదనలు పంపించారు.

- హిరమండలం మండలం గొట్టాబ్యారేజ్ నుంచి నివగాం వరకు 12 కిలోమీటర్ల రోడ్డు పూర్తిస్థాయి అభివృద్ధి కోసం రూ.2.30 కోట్లు మంజూరు చేయాలని కోరారు.
- హిరమండలం మండలం సుభయల జంక్షన్ నుంచి గొట్టాబ్యారేజి వరకు ఉన్న 2 కిలోమీటర్ల రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.6కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు.
- ఎల్.ఎన్.పేట మండలంలోని ఎఫ్.డి.పేట నుంచి బొత్తాడసింగి మీదుగా చింతలబడవంజ గ్రామం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కోసం రూ.2 కోట్లుతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం



ఆమదాలవలస: రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైద్యులు, యువకులు



కొత్తూరు: రక్తదానం చేస్తున్న దాతలు, సత్యసాయి భక్తులు

ఆమదాలవలస: కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గొలివి హాస్పిటల్ వారి సహకారంతో ఆమదాలవలస పట్టణంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 70 మంది రక్తదాతల నుంచి 70 యూనిట్లు బ్లడ్‌ను సేకరించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు చిగురుపల్లి వెంకటేష్ (చిన్నా) తెలిపారు. రక్తదానం చేసిన యువకులను డాక్టర్ గొలివి మోహన్‌రావు అభినందించారు. వైద్యులు కె.వినోద్‌కుమార్, పి.తాతయ్యలు, సి.హెచ్.సుధాకర్, సీపాన హేమమోహన్, సిబ్బంది బగాది వెంకట్, వాయుపుత్ర జిమ్ కోచ్ శ్రీనివాసరావు, బాగాది నేతాజీ, వి.లక్ష్మణరావు, హరీష్, యువకులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: రక్తదానం చేస్తే మరొకరికి పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుందని సత్యసాయి సేవా సమితి హిర మండలం జోనల్ కన్వీనర్ పప్పల అప్పలనాయుడు అన్నారు. సత్యసాయి బాబా సేవా సమితి విభాగంలో భాగంగా ప్రతి ఏడాది జూలై 16న నిర్వహించే యుజవన దినోత్సవాన్ని స్థానిక సత్యసాయి మందిరంలో ఆదివారం కొత్తూరు సత్యసాయి సేవ సమితి కన్వీనర్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. మందిరం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 21 మంది యువకులు రక్తదానం చేశారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన న్యూ శ్రీకాకుళం బ్లెడ్ బ్యాంకు సిబ్బంది రక్తాన్ని సేకరించారు. జోనల్ సేవాదల్ కో ఆర్డినేటర్ లొతుగెడ్డ శ్రీగౌరీ, జోనల్ యూత్ కో ఆర్డినేటర్ అద్దంకి రాంబాబు, జిల్లా యూత్ కో ఆర్డినేటర్ శివకుమార్, జాయింట్ కో ఆర్డినేటర్ సాయి కుమార్, మెట్టూరు సేవా సమితి సేవాదళ్ కన్వీనర్ మణికంఠ పాల్గొన్నారు.

బోరు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జయమునిరావు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలాకి జయమునిరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో అక్కడ పనులు చేసుకుంటున్న లబ్ధిదారులకు తాగునీటిని అందించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి బోరు వేయించారన్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు పరపటి యోగీశ్వరరావు, మీసాల రామచంద్ర, బొంతు రవి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జీసీసీ రేషన్ డిపో



శిథిలావస్థలో ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపో

పాతపట్నం: మండలంలోని లాబర, బైదలాపురం, ఎస్.ఎస్.మనుగు జీసీసీ రేషన్ డిపో శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు రేకులు పూర్తిగా పాడయ్యాయి. గోడలు బీటలు వారాయి. చిన్నవర్షం జల్లు కురిసినా గదుల్లోకి నీరుచేరి నిత్యావసర సరుకులు తడిచిముద్దవుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవడం వల్లే ఈ దుస్థితికి చేరాయని స్థానికులు వాపోతున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి జీసీసీ డిపోలను బాగుచేయాలని కోరుతున్నారు.

నేడు మహిళలకు ప్రత్యేక లోన్ మేళా

పాతపట్నం: పాతపట్నం వెలుగు కార్యాలయంలో సోమవారం ఉదయం పది గంటలకు లోన్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం పి.మనోరత్నం ఆదివారం తెలిపారు. వివిధ బ్యాంకులు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ మహిళలకు చెందిన లోన్‌లు మంజూరు చేయనున్నారన్నారు. మహిళలందరూ లోన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం తెలిపారు.

వలంటీర్లు నిస్వార్థ సేవకులు

కరోనా వంటి కష్ట కాలంలో గ్రామ వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించారు. ప్రభుత్వ పథకాలు నిష్పక్షపాతంగా ప్రజలకు అందిస్తున్నారు. అటువంటి వారిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రుణపడి ఉంటాం



ప్రతీ నెల ఒకటో తేదీన తెల్లవారి సరికి ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్న మా గ్రామ వలంటీర్ సేవలు ఎప్పటికీ మరిచిపోలేం. ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన బాధ్యతలను ఎంతో గౌరవంగా నెరవేరుస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వలంటీర్లకు ఇచ్చిన 50 కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉంటూ కరోనా వంటి కష్టకాలంలోను విలువైన సేవలు అందజేశారు. అలాంటి వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు విన్నప్పుడు బాధేసింది.

– గూన రాజ్యలక్ష్మి, వితంతు పింఛన్ లబ్ధిదారు, తురకపేట, ఎల్.ఎన్.పేట

కొడుకులా ఆదుకున్నాడు



మాది రావిపాడు పంచాయతీ తిలారు రైల్వేస్టేషన్ పరిధి. మా వలంటీరు ముచ్చేటి వెంకట శ్రీనివాసరావు కన్న కొడుకు మాదిరిగా నెలవారి ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే ఇంటికి వచ్చి పింఛను తెచ్చి ఇస్తున్నాడు. కరోనా సమయంలో పక్కింటి వారు సైతం మా ఇంటికి రాకపోయినా ఎంతో ధైర్యం చేసి పింఛన్, అవసరమైన ఇతర సామగ్రి అందించి నాతోపాటు మా కుంటుంబ సభ్యులకు ఎన్నో సేవలు అందించాడు. వలంటీర్‌కు రుణపడి ఉంటాం.

– పొడుగు హైమావతి, తిలారు ఆర్ఎస్, రావిపాడు, జలుమూరు

పవన్‌కు వ్యవస్థలపై అవగాహన లేదు

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: నాయకునిగా ఎదగాలంటే పరిపాలనా వ్యవస్థలన్నింటిపైనా అవగాహన ఉండాలని, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఎటువంటి అవగాహన లేదని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వలంటర్ వ్యవస్థ గురించి పవన్ చాలా చులకనగా మాట్లాడారని, వారు హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని మాట్లాడటం ఆయన బాధ్యతారాహిత్యమన్నారు. వలంటీర్లు గత నాలుగేళ్లుగా ప్రజలకు అనేక సేవలు అందించారని, వృద్ధులు, దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. వలంటీర్ వ్యవస్థను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. సొంతవారే దగ్గరకు చేరని కరోనా సమయంలో.. వలంటీర్లు ప్రాణాలకు తెగించి రాష్ట్రంలోని ప్రజలకు సేవలందించారన్నారు. అటువంటి వారికి పవన్ ఇచ్చిన గౌరవం ఇదా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో పవన్ హైదరాబాద్‌లో ఉంటే, ప్రతీఒక్క వలంటీర్ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించారన్నారు. వలంటీర్లు ప్రజల డేటాని అసాంఘిక శక్తులకు అందిస్తున్నారని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిజంగా ప్రభుత్వం ప్రజల డేటాను ఎవరికైనా అందించాలనుకుంటే నేరుగా సీఎం డాష్ బోర్డు నుంచే అందించవచ్చని, అలాంటిది ఇలా లక్షల మంది వలంటీర్ల ద్వారా చేరవేయాల్సిన అవసరం ఏముందో పవన్ తెలుసుకోవాలన్నారు. ఈ రోజుల్లో ప్రజల వివరాలు మొబైల్ నంబర్‌తో అందుబాటులో ఉన్నాయని, అటువంటి మొబైల్ నంబర్‌ను మనం షాపింగ్ చేసిన ప్రతీసారి బయటకు అందిస్తున్నామని, ఈ విషయంపై పవన్‌కు అవగాహన లేదన్నారు. వలంటరీ వ్యవస్థపై మొదట్లో చంద్రబాబు విషం కక్కేవారని, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఇప్పుడు ఆ స్క్రిప్ట్‌ని పవన్‌కు ఇచ్చి చదివిస్తున్నారని ఎద్దేవా చేశారు. దీనివల్ల పవన్ మరింత ప్రజావ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలు కొప్పల ఈశ్వరరావు, భాస్కరరావు, రుప్ప దుర్గారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియంత్రించాలని వినతి



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న సిటిజన్ సొసైటీ ప్రతినిధులు

నరసన్నపేట: పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పల్లిపేట కూడలి వరకు వాహనాల రద్దీ అధికంగా ఉంటుందని, ప్రయాణిలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఎస్ఐ సింహాచలం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఐకు సొసైటీ ప్రతినిధులు పుచ్చల విశ్వేశ్వరరావు, పూర్ణారావు, రోణంకి కృష్ణంనాయుడు తదితరులు వినతిపత్రం అందజేశారు. రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులు, హోంగార్డ్స్‌తో పహారా కాయించాలని కోరారు. మాంసం విక్రయాలు రోడ్డుకు ఆనుకుని నిర్వహిస్తున్నారని, దీంతో వ్యాధులు సంక్రమిస్తున్నాయని తెలిపారు. కొందరు రోడ్డుపైనే తోపుడు బళ్లతో వ్యాపారాలు చేస్తున్నారని, వారికి సరైన స్థలాలు కేటాయించాలని కోరారు. ఎక్కడకక్కడ వ్యాపారాలు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. సభ్యులు మురళీధర్, ఆనందరావు, సి.హెచ్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీనామృతం తయారీపై అవగాహన



మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తూరు: మీనామృతాన్ని పంటలపై వినియోగించడం వల్ల పంటల ఎదుగుదలతోపాటు చీడపీడలు దరిచేరవని ప్రకృతి వ్యవసాయం ఎంటీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో మీనామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. రెండు కిలోల చేపల వ్యర్థాలు, రెండు కిలోల బెల్లాన్ని బకెట్లో వేసి వారం రోజులు కుళ్లబెట్టాలన్నారు. వారం రోజుల తరువాత వచ్చిన ద్రావణాన్ని పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట ఎదుగుదలతోపాటు ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో తయారు అవుతున్న మీనామృతాన్ని ప్రతీరైతు తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది మాధవి, శ్రీలత, సుభాషిణి, రమణమ్మ, చిన్నమ్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ.30 వేల ఆర్థికసాయం



జయవర్ధన్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్రకు చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు ఆపదలో ఉన్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన ఉసిరికాయల చిన్నారావు, జయలక్ష్మిల 8 ఏళ్ల కుమారుడు జయవర్ధన్ మెదడు సంబంధిత వ్యాధితో వైద్యం పొందుతున్నాడు. వైద్య ఖర్చల నిమిత్తం ట్రస్టు సభ్యులు రూ.15 వేల ఆర్థికసహాయాన్ని ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. కొత్తూరు మండలం పొన్నుటూరు గ్రామానికి చెందిన నరేష్ హైదరాబాద్‌లో తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. పనిచేస్తుండగా శ్లాబ్ నుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. నరేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ట్రస్టు సభ్యులు రూ.15 వేలను హైదరబాద్ వెళ్లి అందజేశారు.

ఔదార్యం..



సాయాన్ని అందజేస్తున్న గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కేధారిపురం గ్రామానికి చెందిన అనపాన చంద్రయ్య భార్య శ్యామల కొంతకాలంగా క్యాన్సర్‌తో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న కేధారిపురం గ్రామానికి చెందిన కేపీఎం గల్ఫ్ ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు తమవంతు సాయానికి ముందుకొచ్చారు. తమవంతు రూ. 23 వేలు, గ్రామ ప్రజలు రూ.25 వేలు సేకరించి..మొత్తం 48 వేల రూపాయలను బాధితురాలి భర్త చంద్రయ్యకు ఆదివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.